
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
19-6-2026 (Friday) MAIN EDITION

## కిన్నెరసాని' అందాలు చూద్దామా..



**అక్షరటుడే, ఖమ్మం :** పచ్చని ప్రకృతి అందాల నెలవు కిన్నెరసాని. ఎన్నో రకాల పక్షులు, వన్య ప్రాణులు ఇక్కడ ఉంటాయి. పచ్చదనంతో కళకళలాడే కిన్నెరసానిలో ప్రభుత్వం జంగిల్ సఫారీని ప్రారంభించింది. ప్రకృతి అందాలను తిలకించే అవకాశం కల్పించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కిన్నెరసాని అటవీ ప్రాంతం ఉంది. ఇందులో జంగిల్ సఫారీని గురువారం సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో పచ్చని అందాలను ఆస్వాదిస్తూ పక్షుల కిలకిలారావాలు వింటూ వన్యప్రాణాలను నేరుగా చూడొచ్చు. ఈ మేరకు మూడు సఫారీ వాహనాలు ఇప్పటికే అక్కడకు చేరుకున్నాయి. వీటి ద్వారా అడవిలో ప్రయాణం చేసే అవకాశం కల్పించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి



**అక్షరటుడే, నల్గొండ :** నల్గొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పెద్దవూర నాగార్జునసాగర్ హైవేపై ముత్యాలమ్మగూడెం వద్ద రెండు కార్లు ఒక దానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. రామన్నగూడెం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

## భారీగా తగ్గిన బంగారం ధరలు



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్ :** దేశంలో బంగారం ధరలు భారీగా తగ్గాయి. అంతర్జాతీయ పరిణామాలతో రేట్లు దిగివచ్చాయి. 10 గ్రాములపై రూ.3,650 తగ్గి 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,45,860కు చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.3,350 తగ్గి రూ.1,33,700 వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి కిలోపై రూ.15 వేలు తగ్గి రూ.2,55,000లకు చేరింది.

## వర్షా లపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** వర్షా లపై అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వర్షా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శానిటేషన్, హెల్త్, అర్బన్ డెవలప్మెంట్ అంశాలు ,ఇందిరమ్మ క్యాంటీన్లు ,పెండింగ్ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రికి నోటీసులు



**అక్షరటుడే, ఏపీ :** మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు మహిళా కమిషన్ నోటీసులు ఇచ్చింది. హోంమంత్రి అనితపై చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరింది. ఈనెల 24న విచారణకు హాజరు కావాలని కమిషన్ ఆదేశించింది. స్పందించకుంటే వీడియో క్లిప్పింగ్స్, ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

## అల్లు అర్జున్‌కు కోర్టు సమన్లు



**అక్షరటుడే, సినిమా డెస్క్ :** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. వచ్చే సోమవారం వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. పుష్ప-2 సినిమా ప్రీమియర్ సమయంలో హైదరాబాద్ నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో గల సంధ్యా థియేటర్‌లో తొక్కిసలాట చోటు చేసుకున్న విషయం తెలిసిందే. హీరో అల్లు అర్జున్ థియేటర్‌కు రావడంతో ఆయనను చూడటానికి అభిమానులు ఒక్కసారిగా లోపలకి వచ్చారు. దీంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఓ మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడితో పాటు పలువురు గాయపడ్డారు. ఈ కేసుపై తాజాగా విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు నిందితులు అందరికి సమన్లు జారీ చేసింది.

## కలిసి పోరాడుదాం.. రాహుల్‌గాంధీ



**అక్షరటుడే, ఢిల్లీ:** తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ డీఎంకే కూటమి నుంచి వైదొలిగి టీవీకేకు మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. అయితే తాజాగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకు థ్యాంక్స్ చెప్పిన రాహుల్ కలిసి పోరాడుదాం అని రిప్లై ఇచ్చారు.

**మళ్లీ డివిజన్లు పెంచనున్నట్లు సమాచారం. జీహెచ్ఎంసీలో గతంలో ప్రభుత్వం పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను విలీనం చేసిన విషయం తెలిసిందే. అనంతరం 150 డివిజన్లను 300కు పెంచింది. అనంతరం జీహెచ్ ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించింది. తాజాగా మరోసారి ఆయా కార్పొరేషన్లలో డివిజన్ల సంఖ్య పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.**

**- అక్షరటుడే, హైదరాబాద్**




# హైదరాబాద్‌లో పెరగనున్న డివిజన్లు

**■ మూడు కార్పొరేషన్లలో పెంచేందుకు కసరత్తు ■ త్వరలో ఎన్నికలు నిర్వహించే అవకాశం**

గతంలో ఉన్న జీహెచ్ఎంసీ ప్రభుత్వం మూడు కార్పొరేషన్లుగా విభజించింది. జీహెచ్ ఎంసీతో పాటు మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఈ మేరకు హద్దులు నిర్ణయించి, డివిజన్ల పునర్విభజన చేసింది. ఈ మూడు కార్పొరేషన్లలో ప్రస్తుతం 300 డివిజన్లు ఉండగా.. వాటిని 400కు పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం.

**విభజన ఇలా**

జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 150 డివిజన్లు ఉండగా.. 200కు పెంచనున్నారు. మల్కాజ్ గిరి కార్పొరేషన్‌లో 76 నుంచి 100 డివిజన్లకు, సైబరాబాద్ కార్పొరేషన్‌లో 74 నుంచి 100 డివిజన్లకు పెంచేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. పరిపాలన సౌలభ్యం కోసం జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇందులో భాగంగానే మరోసారి డివిజన్లు పెంచనున్నట్లు సమాచారం.

**త్వరలో ఎన్నికలు**


జీహెచ్ఎంసీ పాలకవర్గం పదవీకాలం ముగిసిపోయింది. దీంతో త్వరలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. నవంబర్ నెలలో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. జీహెచ్ఎంసీతో పాటే సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఎన్నికల కోసం కాంగ్రెస్ ఇప్పటి నుంచే చర్యలు చేపట్టింది. హైదరాబాద్ నగరంలో నాయకులు పర్యటిస్తున్నారు. బస్తీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నారు. అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నారు. మరోవైపు పారిశుధ్యం, తాగునీటిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది.

## సింగరేణికి ప్రభుత్వమే విద్రోహిగా తయారైంది : కవిత




**అక్షరటుడే, సింగరేణి :** అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు మైన్‌ను టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సందర్శించారు. కార్మికులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. సింగరేణికి ప్రభుత్వమే విద్రోహిగా తయారైంది కవిత విమర్శించారు. 50 వేల కోట్లు బకాయి పెట్టటంతో సంస్థ ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని ఆరోపించారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించటం లేదని మండిపడ్డారు. హెచ్ఎంఎస్‌ను గెలిపిస్తే, కార్మికులు కాలర్ ఎగిరేసుకునేలా చేస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి అత్యధిక రెవెన్యూతో ఉత్తర తెలంగాణకు అన్నం పెడుతోందన్నారు. అలాంటి సంస్థకు చెందిన కార్మికుల మద్దతు కావాలని వారి సమస్యలు తెలుసుకునేందుకు వచ్చానని కవిత తెలిపారు.

## నీట్ పరీక్షకు లైన్ క్లియర్..



**అక్షరటుడే, ఢిల్లీ :** నీట్ యూజీ రీ ఎగ్జామ్‌కు లైన్ క్లియర్ అయింది. పరీక్షపై జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు తెలిపింది. గతంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష రద్దు అయిన విషయం తెలిసిందే. ఈ నెల 21 మళ్లీ ఎగ్జామ్ పెడతామని తెలిపింది. నీట్ పునఃపరీక్షకు సంబంధించి తలెత్తిన సమస్యలపై అత్యవసర విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లను వినడానికి సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. పరీక్షకు సంబంధించిన అన్ని విషయాలు ఇప్పటికే జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణకు ఉన్నాయని పేర్కొంది. పిటిషన్‌పై సుప్రీంకోర్టు తక్షణ ఉపశమనం కల్పించడానికి నిరాకరించింది. లేవనెత్తిన సమస్యలకు సంబంధించి ఎలాంటి ప్రత్యేక విచారణలు ప్రారంభించలేమని స్పష్టం చేసింది.

## ఫిన్లాండ్‌లో తెలంగాణ విద్యార్థి అదృశ్యం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఫిన్లాండ్‌లో తెలంగాణ విద్యార్థి అదృశ్యం అయ్యాడు. 45 రోజులుగా ఆచూకీ గల్లంతు కావడంతో ఇక్కడ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలోని వైదేహి నగర్‌కు చెందిన మణిదీప్ రెడ్డి ఉన్నత చదువుల కోసం ఫిన్లాండ్ వెళ్లాడు. అక్కడ ఓ యూనివర్సిటీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. గత నెల 4న మణిదీప్ తల్లిదండ్రులతో చివరిసారిగా మాట్లాడారు. తర్వాత రోజు నుంచి ఫోన్ చేయలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించడం లేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఫిన్‌లాండ్‌లోని స్నేహితులు, తెలిసిన వారిని మణిదీప్ రూమ్‌కు, కాలేజీకి పంపించినా ఎలాంటి సమాచారం లభించలేదని వారు తెలిపారు.

## సీఐ నాగరాజుపై కేసు నమోదు



**అక్షరటుడే, ఏపీ :** ఏపీలో సంచలనం సృష్టించిన సాయికృష్ణ మిస్సింగ్ కేసులో పోలీసు అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ కేసులో ఇప్పటికే సీఐ నాగరాజుపై కేసు నమోదు అయింది. నేడు ఆయనను అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసులో విజయవాడలోని కృష్ణలంక సీఐ నాగరాజుపై హత్యాయత్నం కేసు నమోదు అయింది. ఉన్నతాధికారులు ఆయనను ఇప్పటికే సస్పెండ్ చేశారు. తాజాగా అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కాగా సాయికృష్ణ (25) అనే యువకుడిని మే 9న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత అతను ఇంటికి రాలేదు. సీఐ నాగరాజు ఆధ్వర్యంలో సాయికృష్ణను పోలీస్ స్టేషన్‌లో కొట్టారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో సాయికృష్ణ చనిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.

## కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మల్కాజ్‌గిరిలో ఒకడు నేను గూండాను, నేను రౌడీని అంటున్నాడు.. నిన్ను కొట్టే రౌడీలు, గూండాలు మా దగ్గర కూడా చాలా మంది ఉన్నారు' అని ఆయన వ్యాఖ్యానించారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ శుక్రవారం మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో బెదిరింపుల రాజకీయాలు పనికిరావని కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దన్నారు. కేసులు పెడితే తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ డే కేర్ సెంటర్ ప్రారంభం




**అక్షరటుడే, హైదరాబాద్ :** చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని అరుంధతి నగర్‌లో అంగన్వాడీ కేంద్రంకమ్ పాలన (డే కేర్) కేంద్రాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేసి, వారి అభ్యాస ప్రదర్శనలను వీక్షించి అభినందించారు. అంగన్వాడీ కేంద్రం, పాలన కేంద్రాన్ని ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం ద్వారా ఒకే కుటుంబంలోని చిన్నారులందరికీ సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉపాధి కోసం బయటకు వెళ్లే తల్లులకు ఈ డే కేర్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

## గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్

**అక్షరటుడే, హైదరాబాద్:** మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్ నగరంలోని బాపూ ఘాట్ వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు పనులకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అనుమతి మంజూరు చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు అనుమతి లభించడం, తెలంగాణ ప్రభుత్వ విజన్ లక్ష్యాలను సాధించడంలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవనం, నదీ తీర ప్రాంతాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పర్యావరణ, సాంస్కృతిక, సామాజిక వనరుల సృష్టి దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఈ నిర్ణయం బలాన్ని చేకూరుస్తుందని వ్యాఖ్యానించారు.

## టెలిగ్రామ్ పిటిషన్‌ను కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు



**అక్షరటుడే, ఢిల్లీ :** నీట్ యూజీ పరీక్ష ఈ నెల 21 జరగనున్న విషయం తెలిసిందే. పరీక్ష నేపథ్యంలో పేపర్ లీకేజీని అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలిక నిషేధం విధించింది. దీనిపై ఆ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ చుక్కెదురైంది. నీట్ పునఃపరీక్ష దృష్ట్యా విధించిన తాత్కాలిక నిషేధాని కి సంబంధించి ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ, టెలిగ్రామ్‌కు ఉపశమనం కల్పించడానికి ఢిల్లీ హైకోర్టు శుక్రవారం నిరాకరించింది. కేంద్రం అన్ని నిబంధనలు, విధివిధానాలను పాటించిందని, సెక్షన్ 69A ప్రకారం టెలిగ్రామ్‌ను నిరోధించే అధికారం ప్రభుత్వానికి ఉందని కోర్టు పేర్కొంది.